# నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికం ఎంప్లాయిస్ - బి.ఎస్.ఎన్.ఎల్.

(రిజిష్టర్ నెం.4906)

## ఆంధ్రప్రదేశ్ సర్కిల్ - విజయవాడ

## సర్కిల్ కార్యవర్గ సమావేశము, విజయవాడ - ది:27.04.2018.

## కార్యవర్గ నివేదిక

*తేది: 27.04.2018*

**డియర్ కామ్రేడ్స్,**

నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికం ఎంప్లాయిస్ - బి.ఎస్.ఎన్.ఎల్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నలు మూలల నుండి సర్కిల్ కార్యవర్గ సమావేశములకు విచ్చేసిన సర్కిల్ ప్యాట్రన్ కా॥ మల్లిశెట్టి జనార్ధనరావు గార్కి, ఆల్ ఇండియా ఆఫీస్ బేరర్లకు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, జిల్లా కార్యదర్శులకు, బ్రాంచి కార్యదర్శులకు క్రియాశీలక సభ్యులకు అందరికి స్వాగతం-సుస్వాగతం.

**1. శ్రద్ధాంజలి:** ఈ సమీక్షాకాలంలో వివిధ కారణముల రీత్యా మరణించిన దేశ నాయకులకు, కార్మిక నాయకులకు, పౌరులకు, కార్మికులకు అందరికి ఈ కార్యవర్గము శ్రద్ధాంజలి ఘటించుచున్నది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించుచున్నది.

**2. రాష్ట్ర కార్యవర్గ సమావేశములు:** గత రాష్ట్ర కార్యవర్గ సమావేశములు నెల్లూరు పట్టణములో ది:07.02.2017 మరియు ది:08.02.2017 తేదీలలో జరిగినవి. నూతనముగా ఆంధ్ర సర్కిల్ ఏర్పడిన తరువాత జరిగిన సమావేశములు అగుట వలన నాయకులు, సభ్యులు క్రియాశీలకముగా పాల్గొని విధాన నిర్ణయములలో భాగస్వామ్యులు అయినారు. అప్పటికి సర్కిల్‌లో గల పరిస్థితులను పూర్తిగా చర్చించుట జరిగినది. ఆ తరువాత కార్యవర్గ సమావేశములు నిర్వహించవలయును అని భావించిననూ, వివిధ కారణములరీత్యా అది సాధ్యపడలేదు. సమావేశములు ఏర్పాటు చేయుటకు ఏ జిల్లా కూడ ముందుకు రాకపోవుట కూడ ఒక కారణము. ప్రస్తుత కార్యవర్గ సమావేశములు జనవరి, ఫిబ్రవరి నెలలోనే ఏర్పాటు చేయవలయును అని సర్కిల్ యూనియన్ భావించిననూ ఏ జిల్లా ముందుకు రాకపోవుట వలన ఏర్పాటు చేయలేకపోయాము. ఏ జిల్లా ముందుకు రాని పరిస్థితులలో, సర్కిల్ యూనియనే నేటి సమావేశములు ఏర్పాటు చేయడం జరిగినది. ఆర్థిక పరిస్థితులు మరియు ఇతర కారణములను దృష్టిలో ఉంచుకొని సమావేశములు ఒక రోజు ఏర్పాటు చేయవలయును అని నిర్ణయించుట జరిగినది. భవిష్యత్తుతో జరగబోవు సమావేశముల గురించి కూడ కార్యవర్గము చర్చించి తగు నిర్ణయం తీసుకోవలయును అని కోరుచున్నాను.

**3. ఆల్ ఇండియా మహా సభలు - అమృతసర్:** ఆల్ ఇండియా 5వ మహాసభలు ది:14.03.2018 నుండి 16.03.2018 వరకు పంజాబు రాష్ట్రములోని అమృతసర్ నగరము నందు రంగ రంగ వైభవముగా జరిగినవి. డాట్‌లో రిక్రూట్ అయిన బి.ఎస్.ఎన్.ఎల్. ఎంప్లాయిస్‌కు ఇవి చివరి మహా సభలు అయినందున మరియు అమృతసర్ టూరిస్టు ప్రాంతము అయినందున అధిక సంఖ్యలో ప్రతినిధులు, కార్యకర్తలు దాదాపు 3500 వరకు హాజరైనారు. మన సర్కిల్‌నుండి దాదాపు 300 మంది ప్రతినిధులు హాజరైనారు. రిసెప్షన్ కమిటీ వారు కూడ అందరికి వసతి సౌకర్యం, భోజన వసతులు మొ॥వి ఏర్పాటు చేయుటలో కృతకృత్యులు అయ్యి అందరి మన్ననలు పొందారు. 14వ తేదీ ఉదయం ఓపెన్ హౌస్ సెషన్ జరిగినది. ఎ.ఐ.టి.యు.సి. ప్రధాన కార్యదర్శి శ్రీమతి అమర్‌జిత్ కౌర్ మహాసభలు ప్రారంభించి ప్రధానోపన్యాసము చేశారు. మహా సభలకు ఆమె ఉపన్యాసము ప్రధాన ఆకర్షణగా ఉండి మహా సభలను ఉత్తేజపరచినవి. భారత దేశములో కార్మికుల పరిస్థితులు, కార్మిక సంఘముల బాధ్యతలు ప్రభుత్వ వైఖరి, కార్పొరేట్ సెక్టార్స్ కు, ప్రభుత్వమునకు గల అనుబంధము, జియో రిలయెన్స్‌కు ప్రభుత్వము యొక్క సహకారము - బి.ఎస్.ఎన్.ఎల్.కు జరుగు నష్టము గూర్చి వివరించారు. కార్మికులపట్ల ఎఐటియుసి, పాత్ర నిబద్ధత, గూర్చి స్పష్టముగా తెలియపర్చెను. బి.ఎస్.ఎన్.ఎల్. ఉద్యోగుల తరపున పోరాడి తమ వంతు కార్మిక పాత్ర నిర్వహించెదము అని తెలియపర్చినారు. అనంతరము అన్ని యూనియన్స్‌కు చెందిన ప్రదాన కార్యదర్శులు మహా సభలకు తమ సందేశములు ఇచ్చినారు. 34 మంది సర్కిల్‌కార్యదర్శులు మహా సభల చర్చలలో పాల్గొనెను. ప్రధానముగా, 3వ వేతన సవరణ, టవర్ కంపెనీ ఏర్పాటు, వాస్తవ స్కేలుపై పెన్షన్ కంట్రిబ్యూషన్, గ్రాట్యుటి 20 లక్షలు కాకుండా అదనంగా 25%

చెల్లించుట, మల్టి స్కిల్డ్ క్యాడర్ సృష్టి, స్టాగ్నేషన్ ఇంక్రిమెంట్సు మొ॥గు అంశములు లోతుగా చర్చించెను. అనంతరము 2018-21 సం॥లకు నూతన కార్యవర్గముగా కా॥ ఇస్లామ్ అహ్మద్, కా॥ చండేశ్వర్‌సింగ్, కా॥ ఎ.రాజమౌళి, జాతీయ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, ఫైనాన్షియల్ సెక్రటరీగా ఏకగ్రీవము ఎన్నికయ్యారు. మన సర్కిల్‌నుండి కా॥ టి.వి. రమణమూర్తిగారు సెక్రటరీ ఫెడరేషన్ మరియు కా॥ ఎన్.వి. సుబ్రమణ్యేశ్వరరావు, ప॥గో॥ జిల్లా, పర్మినెంటు ఇన్వైటీగా ఎన్నికయ్యెను. వారికి సర్కిల్ యూనియన్ అభినందనలు తెలియజేయుచున్నది. మన సర్కిల్‌నుండి హాజరైన ప్రతినిధుల సమావేశము ఏర్పాటు చేసి మెజారిటి నిర్ణయమును అనుసరించి ముందుకు సాగుట జరిగినది.

**4. 3వ వేతన సవరణ :-** 3వ వేతన సవరణ బి.ఎస్.ఎన్.ఎల్ ఉద్యోగులకు ది: 01.01.2017 నుండి జరగవలసియున్నది. 3వ వేతన సవరణకు సంబంధించి వేతన సవరణ కమిటీ వేయబడిననూ, డి.పి.ఇ. మార్గదర్శకములు, వాటితోపాటు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్సు ఇంతవరకు విడుదల కాలేదు. కారణం ఎఫర్టబిలిటీ అనే కండీషన్, మూడు సంవత్సరములు లాభములు ఆర్జించుట అనేవి అడ్డంకిగా మారినవి. వీటి నుండి బి.ఎస్.ఎన్.ఎల్.కు మినహాయింపు ఇవ్వవలయును అని డిమాండు చేయుచూ మనము “ఆల్ యూనియన్స్ మరియు అసోసియేషన్స్ బేనర్‌పై అందరము కలసి పోరాడుచున్నాము. రెండు రోజుల సమ్మెతోపాటు, “**సంచార్ భవన్ మార్చ్**” లాంటి భారీ ఆందోళన కార్యక్రమములు నిర్వహించాము.

**ప్రస్తుత పరిస్థితి :-** ది: 23.02.2018న సంచార్ భవన్ మార్చి అనంతరము ది: 24.02.2013న కమ్యూనికేషన్స్ మంత్రివర్యులకు మరియు ఆల్ యూనియన్స్ అండ్ అసోసియేషన్స్ మధ్య జరిగిన చర్చల ఫలితమును అనుసరించి మంత్రిగారి ద్వారా ఎఫర్టబిలిటీ అనే షరతుకు మినహాయింపు క్యాబినేటు ద్వారా తీసుకొనబడును అనే హామీ ఇవ్వబడినది. ఇందులకు డాట్, డి.పి.ఇ. మరియు కేంద్ర క్యాబినేటు ఇన్వాల్‌మెంట్ అవసరమైయున్నది. మంత్రి గారి ఆదేశానుసారము డాట్ ద్వారా డి.పి.ఇ.కి. రిఫర్ చేయబడినది. డి.పి.ఇ. ది: 16.04.2018న ఎఫర్టబిలిటీ కండీషన్ మినహాయింపు విషయమై డాట్ మాత్రమే నిర్ణయము తీసుకొనవలయును అని తెలియజేసెను. డాట్ ఎఫర్టబిలిటీ-కండీషన్ నుండి మినహాయింపు కోరుచూ, ఫిట్‌మెంట్ ఎంత ఇవ్వవలయునో తెలియపర్చుచూ క్యాబినెట్ నోటు తయారు చేయును. తదనంతరము మంత్రిగారికి వెళ్ళును. అనంతరము క్యాబినెట్‌కు వెళ్ళును. క్యాబినెట్ అనుమతి అనంతరము జాయింట్ కమిటీ నియమించబడి పే-రివిజన్ పై చర్చలు జరుగును. ఆల్ యూనియన్స్ అండ్ అసోసియేషన్స్ త్వరగా మంత్రిగారితోను డాట్ సెక్రటరీ గారితోను సమావేశము కావలయును అని ది:24.04.2018న జరిగిన సమావేశములో నిర్ణయించుట జరిగినది.

**5. సబ్సిడరీ టవర్-కంపెనీ ఏర్పాటు :-** బి.ఎస్.ఎన్.ఎల్. ఆధీనములో 66,800 సెల్ టవర్స్‌ను బి.ఎస్.ఎన్.ఎల్. నుండి విడదీసి ఒక సపరేటు సబ్సిడీ కంపెనీగా ఏర్పాటు చేయవలయును అనేది ప్రభుత్వ నిర్ణయము. దీనిని 2017 సెప్టెంబరు 12వ తేదీన కేంద్ర క్యాబినేటు ఆమోదించుట జరిగినది. మొదటి నుండి యూనియన్స్ అండ్ అసోసియేషన్స్ ఈ నిర్ణయమును వ్యతిరేకించుచున్నవి. కారణం ఇది బి.ఎస్.ఎన్.ఎల్ కు నష్టదాయకము. దీని వలన బి.ఎస్.ఎన్.ఎల్. ముక్క ముక్కలుగా మారి క్షీణించును. అభివృద్ధి దిశగా పయనించుచున్న బి.ఎస్.ఎన్.ఎల్. కు ఇది తీవ్ర విఘాతము కల్గించును. చివరకు బి.ఎస్.ఎన్.ఎల్.ను అమ్మి వేసే దిశకు తీసుకు వెళ్ళవలయును అనేది ప్రభుత్వము యొక్క కుట్ర. దానిలో భాగంగా బి.ఎస్.ఎన్.ఎల్.కు సబ్సిడరీ కంపెనీగా ఉండవలసిన టవర్ కంపెనీకి ఒక ఐ.ఎ.ఎస్. అధికారిని నియమించుట, డాట్‌లో రిపోర్టు ఇచ్చుట, ప్రత్యేక కంపెనీగా రిజిష్టర్ చేయించుట మొదలగు ప్రభుత్వ చర్యలు అన్నియు బి.ఎస్.ఎన్.ఎల్.ను నిర్వీర్యం చేయుటకు నిర్దేశింప బడినవి అని స్పష్టముగా తెలియచున్నది. టెనన్సీ పెంచుట, అధిక రెవిన్యూ సంపాదించుట, అవి బి.ఎస్.ఎన్.ఎల్. కు చెందుట అనేవి గాల్లో మాటలుగా తేలినవి. ఇవి జరిగినచో మన టవర్స్‌కు మనమే అద్దె కట్టుకోవలసిన దుస్థితి ఏర్పడును. ఇందుకు విరుద్ధముగా మనము అనేక పోరాటములు చేసియున్నాము. దానిలో భాగంగా ధర్నా నిర్వహించాము. ది: 19.04.2018 న గవర్నర్‌కు మెమోరాండం సమర్పించాము. ది: 24.04.2018న ఆల్ యూనియన్స్ అండ్ అసోసియేషన్స్ సమావేశమై ఈ విధముగా నిర్ణయములు చేయుట జరిగినది. (1) ది:07.05.2018నుండి ది:11.05.2018వరకు దేశవ్యాప్తముగా స్ట్రీట్ - కార్నర్ మీటింగులు, (2) చివరి రోజున అనగా మే 11వ తేదీన మాసీవ్ డిమాన్‌స్ట్రేషన్స్, భారత ప్రధానమంత్రిగారికి ఫ్యాక్స్ మెసేజ్‌లు

......3...,

పంపుట, (3) సెంట్రల్ లెవల్ కన్వెన్షన్ నిర్వహించుట. న్యాయపరమైన పోరాటమునకు కూడా సిద్ధపడుచున్నాము. తదుపరి ఆల్ యూనియన్ & అసోసియేషన్స్ సమావేశము మే 8వ తేదీన ఉండును.

**6. టెలికాం హౌస్-సర్కిల్ యూనియన్ ఆఫీసు :-** ఆంధ్రప్రదేశ్ సర్కిల్ యూనియన్-ఆంధ్ర, తెలంగాణా సర్కిల్ యూనియన్స్ గా విభజన అనంతరం -ఆస్తుల పంపిణీలో ఆంధ్రసర్కిల్ యూనియన్‌కు ఖాళీ స్థలము మరియు దానిలోని రేకుల షెడ్డులో రెండు రూములు తాత్కాలిక ఏర్పాటుతో మనకు వచ్చినవి. దానిలో కరెంటు, ట్యాప్ కనెక్షన్ క్రొత్తగా ఏ.పి. సర్కిల్ యూనియన్ పేరుమీద తీసుకున్నాము. బాతురూము, గేటు, రెండు సర్కిల్ యూనియన్స్‌కు మధ్య లో గోడ ఏర్పాటు చేసుకున్నాము. ఇవి అన్నియు ఎసెట్స్ పై ఏర్పడిన సబ్ కమిటీ నిర్ణయమును అనుసరించి చేయుట జరిగినది. ఇది నెల్లూరు వర్కింగ్ కమిటీ ఆమోదించుట జరిగినది. ప్రస్తుతము ఒక రూము సర్కిల్ యూనియన్ ఆధీనములో సర్కిల్ యూనియన్‌కు సంబంధించిన కొంత మెటీరీయల్ తో ఉండగా రెండవ రూము అద్దెకు ఇచ్చియున్నాము. దీనిపై సరైన సమయములో సర్కిల్ కార్యవర్గములో నిర్ణయము తీసుకొనబడును. తరువాత సర్కిల్ ఆఫీసు ద్వారా సర్కిల్ యూనియన్ కు యూనియన్ ఆఫీసు ఏర్పాటు చేయబడలేదు. సర్కిల్ ఆఫీసు క్రొత్తగా ఏర్పడుట వలన బి.ఎస్.ఎన్.ఎల్. భవన్‌లో ఆఫీసు వసతి సౌకర్యము తక్కువగా ఉండుట వలన ఇప్పటి వరకు ఏ యూనియన్‌కు యూనియన్ ఆఫీసుల కేటాయింపు జరగలేదు. త్వరలో ఏర్పాటు చేయబడి సర్కిల్ యూనియన్ ఆఫీసు ఏర్పడును.

**7. 2018-19 సం॥ము ట్రాన్స్‌ఫర్ పాలసీ అమలు-ఏ.పి. సర్కిల్ :-** ఫిబ్రవరి 2017 సర్కిల్ కార్యవర్గములో తీసుకున్న నిర్ణయమును అనుసరించి కార్పోరేటు ఆఫీసు ట్రాన్స్‌ఫర్ పాలసీని అమలు చేయవలయును అని 2017-18 సంవత్సరము పాలసీ అమలు చేయు ప్రక్రియలో భాగం సర్కిల్ యూనియన్ డిమాండు చేయుట జరిగినది. ఎంప్లాయీస్ యూనియన్ సర్కిల్ పాలసీని అమలు చేయమని డిమాండ్ చేయుట జరిగినది. రెండు యూనియన్స్ మధ్య ఏకాభిప్రాయము లేని కారణముగా సర్కిల్ ఆఫీసు గత సంవత్సరము వరకు అమలు చేయుచున్న సర్కిల్ పాలసీనే 2017-18 సంవత్సరము పాలసీగా విడుదల చేయుట జరిగినది. దీనిపై మన యూనియన్ ఆల్ ఇండియా యూనియన్‌కు ఫిర్యాదు చేయుట "ఎఫ్" క్లాజుకు వివరణ తెప్పించుట దానిని జిల్లాలకు పంపుట జరిగినది.

2018-19 సం॥ము నకు సంబంధించి కార్పొరేటు ఆఫీస్ పాలసీగా అమలు చేయవలసినదిగా కోరుచూ సర్కిల్ యూనియన్ ది: 16.01.2018 మరియు 26.03.2018 న సర్కిల్ మేనేజ్‌మెంట్ కు లేఖలు వ్రాయుట జరిగినది. వాటిని సర్కిల్ యూనియన్ వెబ్‌సైట్ లో ది: 25.03.2018 పెట్టుట జరిగినది.

సర్కిల్ యూనియన్ డెలిగేషన్ (CS, ACS, Treasurer) సర్కిల్ మేనేజ్‌మెంటుతో జనవరి మరియు ఫిబ్రవరి 2018న చర్చించుట జరిగినది. కార్పోరేటు ట్రాన్స్‌ఫర్ పాలసీని అమలు చేయమని డిమాండు చేయుట జరిగినది. తరువాత మార్చి 2018 నుండి రెండు యూనియన్స్ ను విడివిడిగా పిలుచుట జరిగినది. సర్కిల్ యూనియన్ డెలిగేషన్ (CS, Organizing Secretary, Treasurer) వెళ్ళి యూనియన్ అభిప్రాయము (కార్పోరేటు పాలసీని అమలు చేయమని) స్పష్టము చేయుట జరిగినది. కా॥ నాగేంద్రబాబు నేను రాలేకపోవు చున్నాను మీరు చర్చలు కొనసాగించవలసినదిగా సర్కిల్ యూనియన్ కోరుట జరిగినది. ఎంప్లాయీస్ యూనియన్ పాత పాలసీని అమలు చేయమని కోరుట జరిగినది.

**సర్కిల్ మేనేజ్‌మెంట్ వైఖరి :-** 1) కార్పోరేటు ట్రాన్స్‌ఫర్ పాలసీ అమలు చేసే క్రమములో జిల్లాలలోని రూరల్ / అర్బన్ ప్రాంతము సర్కిల్ హెడ్ గుర్తించవలయును. 2) 5000 జనాభా గల మరియు 25% జనాభా వ్యవసాయము చేయని వారిగా ఉన్నచో ప్రతి గ్రామీణ ప్రాంతము అర్బన్ ప్రాంతముగా మారును 3) 55 సం॥లు నిండిన మహిళలకు రూరల్ ప్రాంతమునకు ట్రాన్స్‌ఫర్స్ ఉండవు గాని అర్బన్ ప్రాంతములకు ట్రాన్స్‌ఫర్స్ ఉండును. 3) క్రొత్త పాలసీ ప్రకారం -టెన్యూర్ - 3 సం॥లు పాత పాలసీ ప్రకారము టెన్యూర్ -2 సం॥లు 4) క్రొత్త పాలసీని అమలు చేయుటకు -జిల్లాలలో కలెక్టర్ ఆఫీసు నుండి రూరల్ /

......4...,

అర్బన్ ప్రాంతములు ఎస్.ఎస్.ఎ.ల. ద్వారా తెప్పించి గుర్తించుటకు 3 నుండి 4 నెలలు పట్టును. 5) ట్రాన్సఫర్స్ 4 నెలలు ఆలస్యమగును.

సర్కిల్ మేనేజ్‌మెంట్ రెండు యూనియన్స్ అభిప్రాయములు తీసుకొని 2017-18 సం॥ము పాలసీ నే 2018-19 సం॥ము పాలసీ గా నిర్ణయించి ది: 06.04.2018న విడుదల చేయుట జరిగినది.

పై విషయములు అన్నియు కార్యవర్గము లోతుగా చర్చించి, నిర్ణయము తీసుకొనవలయును అని కోరుచున్నాను. ఈ నిర్ణయమును అనుసరించి సర్కిల్ యూనియన్ కార్యచరణ ఉండును అని తెలియపర్చుచున్నాను. కార్యవర్గము నిర్ణయములు తప్ప - సర్కిల్ యూనియన్‌కు వేరే అభిప్రాయము ఉండదు. సర్కిల్ కార్యవర్గ నిర్ణయమే సర్కిల్ యూనియన్ స్ట్రాటజీ అని మరియొకసారి స్పష్టము చేయుచున్నాము.

**8. లోకల్ / సర్కిల్ కౌన్సిల్స్ :-** జిల్లా కార్యదర్శుల రిపోర్టును అనుసరించి కొన్ని ఎస్.ఎస్.ఎ.లలో ఎల్.సి.యం.లు ప్రారంభం కాలేదు. అనగా ఒక ఎల్.సి.యం. మీటింగుకూడా జరుగలేదు. కొన్ని జిల్లాలలో ఒకటి లేక రెండు మాత్రమే జరిగినట్లు తెలియచున్నది. రెండు నెలలకు ఒకసారి ఎల్.సి.ఎం. మీటింగులు జరుపవలయును. ఈ దిశగా జిల్లా కార్యదర్శులు చర్యలు తీసుకొనవలయును. సర్కిల్ లో సి.సి.యం.లు ఇప్పటికి రెండు జరిగినవి. మూడవ సి.సి.ఎం. జూన్ నెలలో ఉండును.

**9. జిల్లాల పని తీరు :-** జిల్లా యూనియన్‌ల పని తీరు సంతృప్తికరంగా వున్నది. కాని కొన్ని జిల్లాలలో సమస్యలు తీవ్రముగా వున్నవి. జి.యం.లు లేకపోవుట, ఇన్‌చార్జి జి.యం.లు ఆయా జిల్లాలకు రాక మరియు మొండిగా వ్యవహరించుట వలన సమస్యలు తీవ్రముగా వున్నవి. వాటి విషయంలో అందరం కలిసి సంఘటితముగా ముందుకు సాగవలసియున్నది. ఈ విషయంలో సర్కిల్ యూనియన్ తీసుకొను ఆందోళన కార్యక్రమమునకు అందరూ సహకరించవలసినదిగా కోరుచున్నాము.

**10. ఆల్ యూనియన్స్ అండ్ అసోసియేషన్స్:-** 7వ వెరిఫికేషన్ అనంతరము ఎన్.ఎఫ్.టి.ఇ. టిప్పు, సేవ, బి.టి.ఇ.యు, పేవ, టి.ఓ.ఎ యూనియన్లతో నేషనల్ ఫోరం ఆఫ్ బి.ఎస్.ఎన్.ఎల్. యూనియన్స్ & అసోసియేషన్స్" గా ఏర్పడుట జరిగినది. ఈ ఫోరం బేనర్ పై మనం అనేక రకములైన కార్యక్రమములు దేశవ్యాప్తంగా నిర్వహించుట జరిగినది. తదనంతరం మారిన పరిస్థితుల పరిణామక్రమములో ఐక్యత దృష్ట్యా సమస్యల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రెండు ఫోరమ్స్ కలసి యునైటెడ్ గా ముందుకు వెళ్ళవలసిన అనివార్యమైన పరిస్థితి. పై పరిస్థితులను గమనంలోకి తీసుకొని ప్రభుత్వమును ఎదుర్కొనుటకు పి.ఆర్.సి. టవర్ కంపెనీ మొదలగు సమస్యలపై ఆల్ యూనియన్స్ అండ్ అసోసియేషన్ బ్యానర్ పై కలసి ముందుకు సాగుచున్నాము.

**11 ముగింపు :-** ఈ సమీక్షా కాలంలో సర్కిల్ యూనియన్ తన కార్యనిర్వహణలో అన్ని విధముల సహకరించిన జిల్లా కార్యదర్శులకు, సర్కిల్ కార్యవర్గ సభ్యులకు, క్రియాశీలక సభ్యులకు, కార్యకర్తలకు, ఆల్ ఇండియా ఆఫీసు బేరర్లకు అందరికి హృదయ పూర్వక ధన్యవాదములు. అదే విధముగా సమస్యలు పరిష్కరించుటయందు సహకరించిన సర్కిల్ మేనేజ్‌మెంటుకు ధన్యవాదములు. ఈ మీటింగు ఏర్పాటు చేయుటకు ఈ హాలు ఏర్పాటు చేసిన సి.పి.ఐ. పార్టీవారికి, అందుకు సహకరించిన కార్యకర్తలకు ధన్యవాదములు తెలియజేయుచున్నాము.

ధన్యవాదములతో...,

ఇట్లు,
భవదీయుడు,

**(సి. హెచ్. చంద్రశేఖరరావు),**
**సర్కిల్ కార్యదర్శి.**

**ఎన్.ఎఫ్.టి.ఇ. - జిందాబాద్!**

**కార్మికుల ఐక్యత - వర్ధిల్లాలి!**

**బి.ఎస్.ఎన్.ఎల్. - లాంగ్ లీవ్.**